

# త్రిమూర్తులు

జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి

ఆ మువ్వురూ ఒక చోట కలుసుకున్నారా, స్వర్గం రెక్కలు కట్టుకుని వచ్చి ఆ రాత్రంతా అక్కడ ఉండి పోవాల్సిందే! అందులో సందేహమే లేదు.

అయితే వాళ్ళందరూ అలా కలుసుకోవడం అంత సులభంగా అయ్యే పని కాదు.

పత్రికా సంపాదకుడు కనక వైకుంఠం ఎప్పుడూ పత్రికా కార్యాలయంలోనే ఉంటాడు.

వచ్చిన చిక్కల్లా ఇద్దరితోనే.

జగపతి మునిసిపల్ ఛైర్మన్. అసలు ఆయనకి అత్యంత ప్రాణప్రదమైన రాజకీయాలకే కాలం సరిపోయి ఏడ్వదు. అథవా ఎప్పుడైనా ఏ కొంచెం తీరిక దొరికిందంటే చాలు—సభలూ, సమావేశాలూ .... ఏవేవో కూ[illegible]టాయి. ఊపిరి పీల్చుకోవడానికైనా టైమ్ లేకుండా ఉంటుంది, పాపం, అతనికి.

ఇకపోతే, అనంతమూర్తి. సతతం అతని బుర్రలో

అనంతమైన ఆలోచనలు . . . . వాటికంతా వూపిరి పోసి రచనల రూపాల్లోకి తేటానికి ఎన్నో నుప్ప తిప్పలు . . . .ఎక్కడ బడితే అక్కడ పిచ్చి వాడిలా తిరుగుతు టాడు. అతని రాకను అపేక్షించే వారికెవర్కి సాధారణంగా ఆశాభంగంకలుగుతుంటుంది.

జగపతి, అనంతమూర్తి ఏదో ఒక రకంగా ఒకకూడి వైకుంటంతో కలిసే రోజు ఏడాది కో శివరాత్రిలా వస్తుంటుంది.

వైకుంటం, జగపతి, అనంతమూర్తి కాకతాళీయంగా భేటి అయ్యారు ఆ రోజు పత్రికా కార్యాలయంలో.

సాయంకాలం ఎక్కడో బహిరంగ సభలో గంటలు తరబడి ఉపన్యాసం ఇచ్చి ఇచ్చి అలసిపోయిన జగపతీ, ఆ రోజంతా కథ రాయడంలో బుర్ర వేడెక్కిపోయిన అనంతమూర్తీ, ఏదో ఆర్టికిల్ తన పత్రికలో వేయటానికి వూరంతా చెడ తిరిగి విషయాన్ని సేకరించిన వైకుంటం — స్వర్గ లోకంలో సేద తీర్చుకోటానికి తొందర పడిపోతున్నారు.

సకల సన్నాహాలూ నిమిషాల్లో పూర్తయినాయి.

"ఛీర్స్" అని నువ్వుతూ తను చేతుల్లోని గ్లాసుల్ని తాటించడంతో స్వర్గారోహణం ప్రారంభమయింది.

ఒక్కో చుక్క మందు గొంతులోకి దిగుతుంటే ఒక్కో మెట్టు పైకి . . . .

పొద్దెరగని వాళ్ళని చూసి గోడ గడియారం గంట పన్నెండని గోల పెట్టింది.

పేలాడుకుంటూ, పిచ్చాపాటి మాట్లాడుకుంటూ, ఫ్రై చేసిన మాంసపు ముక్కలు పకోడీలు నంజుకుంటూ, దివ్యమైన సిగరెట్లు కాల్చుకుంటూ . . . మందు సేవించడం అప్పటికి పూర్తి చేశారు వాళ్ళు.

తరవాత స్పెషల్ బిరియానీ, చిక్కెన్‌లని ఎక్కా ముక్కా మెక్కడం కూడా పూర్తయింది.

స్వర్గభోగాలు సగం అయినాయి.

మిగిలిన సగానికి హఠాత్తుగా విఘాతం ఏర్పడింది. యమకింకరుల్లా వచ్చి పోలీసులు లాడ్జీలపై పడ్డారు.

లాడ్జీల్లో దీపాల్లా వెలిగే అమ్మాయిలని కట కటాల్లోకి తొక్కుపోయారు.

సగం స్వర్గభోగాలని అందించే అమ్మాయిలని అలా పోలీసులు పుణ్యాం కట్టుకోవడంతో వైకుంటం, జగపతి, అనంతమూర్తుల మొహాలు దీపాల్లేని లాడ్జీ మొహాల్లా అయిపోయాయి.

చెప్పలేనంత వెలితీ, బాధా అందర్లోనూ.

ఆఫీసు కెదురుగా రోడ్డు కవతల ఉన్న లాడ్జీ "అప్సరా"లోని లైట్లు వెలగడం,ఆరిపోవడంగా ఉంటే ఏదో అనుమానం తగిలింది వైకుంఠానికి.

ఆదే అందరి ముందు వెల్లడించాడు.

"దివ్యమైన సిగరెట్ల వాసన్ని సైతం త్రోసి రాజని అక్కడి అగరొత్తుల పరిమళం ఇక్కడి కొస్తూంది గమండీ! ఇంకా అనుమానం దేనికి?. . ." అంటూ వైకుంటం అనుమానానికి మరింత బలం పోశాడు అనంతమూర్తి.

"'ఒరేయ్, సుబ్బారాయుడూ!. . . ." అంటూ



బొమ్మల కొలువు

ఫోటో—పల్లాది లీల

ఆఫీసులోంచే ఒక గావు కేక పెట్టాడు జగపతి.

అప్సరా లాడ్జి ఓనర్ సుబ్బారాయుడు.

సుబ్బారాయుడుకీ, జగపతికీ కొంచెం దగ్గర సంబంధముంది. అమ్మాయిలతో వ్యాపారం సాగుతున్న ఆ లాడ్జి బిల్డింగ్ సొంతదారుడు జగపతే. అప్పటికన్నా ఎక్కువ అద్దె గిట్టుబాటు కావడంతో సుబ్బారాయుడి వ్యాపారానికే వదిలేశాడు తన బిల్డింగ్‌ని జగపతి.

వ్యాపారంలో మునిగి తేలిన దిట్ట సుబ్బారాయుడు. పోలీసుల కాళ్ళూ, వేళ్ళూ పట్టుకోగో, అంతో, ఇంతో లంచాలు ముట్టజెప్పి రైడింగ్ వేళల్లో సైతం వ్యాపారం నిలపకుండా నడపటం అతని కొక్కడికే చేతనౌను. సుబ్బారాయుడి వ్యాపార దక్షత జగపతికి బాగా ఎరుక!

జగపతి కేక చెవిన పడిందో లేదో పరుగు మీద వచ్చాడు సుబ్బారాయుడు.

"లేక లేక వచ్చారు మనవాళ్ళు, సుబ్బారాయుడూ! చిలక లేమన్నా ఉన్నాయా!?" వైకుంటం అడిగాడు జగపతికి సూటిగా.

పెద్ద చిక్కే ఎదురైంది సుబ్బారాయుడికి.

తను రెండు చేతులా సంపాదించేది ముఖ్యంగా ఇలాంటి వేళల్లోనే. అయిదు రూపాయల రేటుని పదికి పెంచినా వ్యాపారం జోరుగానే ఉంటుంది. ఎందుకంటే, అన్ని లాడ్జీలూ మూత కనక. మంచి బిజినెస్ టైమ్‌లో ఏం చెప్పటానికి తోచ లేదు సుబ్బారాయుడికి.

లేరంటే జగపతి నమ్మడు.

స్వయంగా వచ్చినా వస్తాడు లోనికి.

అమ్మాయిలని కనక చూశాడా, తనని వాయిక లిరగ తన్నినా తన్నొచ్చు. మొండే దుడుకు మనిషి!

అంతటితోనే కథ ఎక్కడాగుతుంది?

రచయిత కాబట్టి అనంతమూర్తి రహస్యంగా జరుగుతున్న తన వ్యాపారంపై ఘాటుగా ఒక ఆర్టికిల్ రాసి పారేస్తాడు. దాన్ని వైకుంటం తన పత్రికలో కసికసిగా వేసేస్తాడు. గుట్టుగా జరుగుతున్న తన వ్యాపారం రట్టు అయిపోతుంది. తన కొట్లో దుమ్ము పడిపోతుంది.

పోనీ ఉన్నారంటే—ముగ్గురమ్మాయిల సంపాదన పాడైపోతుంది. లోగడ ఏనాడూ పైసా విదిలించ లేదీ త్రిమూర్తులు!



సారథి...

ఫోటో—ఎస్. ఉగ్రనారాయణ

"పలకవేం, సుబ్బారాయుడూ . . ." జాప్యానికి కోపగించుకున్నాడు జగపతి.

"ఉన్నారండీ ... అయితే క్లాస్ ఫిగర్స్ లేరు. రైడింగ్ అని దూరంగా పంపించేశాను" అన్నాడు సుబ్బారాయుడు.

"ఒక నాదిరి చిలకలైనా . . ." వైకుంటం ఆశగా దేవురించాడు.

"మీ కబర్దం చెప్తానటండీ . . . . పంపివా పేరుండాగ్గాద ..." నీళ్ళు నములుతూ అన్నాడు సుబ్బారాయుడు.

"గుడ్డికన్నా మెల్ల మేలన్నారు. అయ్యా, సుబ్బారాయుడూ! నూ కిప్పుడు పక్కలోకి పిట్టలు అత్యవసరం. ఎవల్నో ఒక ముగ్గుర్ని పంపించేయ్, బాబూ!" తొందరించాడు అనంతమూర్తి.

"వాడు పంపించడం కాదు, రచయితగారూ! శ్రమ అనుకోకుండా మీరే వెళ్ళి రావడం మంచిది సెలక్షన్‌కి" అన్నాడు జగపతి.

పంచె ఎగగట్టి, సుబ్బారాయుడి వెంట రోడ్డు మీదకు పోయిన అనంతమూర్తిని వెనక్కి పిలిచాడు జగపతి.

"వాడు కన్నీ ఫేరో! మంచి ముండల్ని దాచి పెట్టి ముసలి కుంటుల్ని చూపెట్టినా చూపెట్టొచ్చు. లోన బాగా చూడు... " అని మెల్లగా అతని చెవిలో వూది మళ్ళీ పంపిలిచాడు జగపతి.

జగపతి మాటే అక్షరాలా నిజమైంది.

చూపుకైనా సహించని ముసలి గుంటల్లాంటి ఐదారుగురు ముండల్ని చూపెట్టి, అంతటితో తన బాధ్యత తీరినట్లు చేయి కడుక్కున్నాడు సుబ్బారాయుడు.

"లోన బాగా చూడు." జగపతి ఉపదేశం గుర్తు రావడంతో అనంతమూర్తి కళ్ళు వసారు మూలగా ఉన్న ఒక గది తాళంపై నిలిచాయి.

"ఈ గది కాస్త తెరుస్తావా, సుబ్బారాయుడూ?" ఆ గది ముందుకు నడిచి అన్నాడు అనంతమూర్తి.

సుబ్బారాయుడి గుండెలో రాయి పడింది. "ఎందుకండీ? . . . . అది ఖాళీ రూమ్ . . ." తెరవటానికి తటపటాయిస్తూ అన్నాడు.

"అనుమానం పెనుభూతం అన్నారు. కాస్త చూసిపోతే పోలే . . ."

సుబ్బారాయుడు ఆ రూమ్ తెరవక తప్పిందికాదు.

రూమ్ తెరవగానే అమృతాంజనం వాసన గుప్పు మంది. అయితే అదేదీ పట్టించుకునే స్థితిలో లేడు అనంతమూర్తి. మబ్బుల్లో మెరుపు తీగలా ఉన్న ఆ అందాల రాశిని అనిమిష నేత్రాలతో ఒక ప్రక్క చూస్తూ, సుబ్బారాయుడి మోసానికి మరో ప్రక్క అట్టుడికి నట్టుడికి పోతున్నాడు.

"మన్నించండి. ఇది రెండు రోజులుగా తల నొప్పి, జ్వరంతో బాధపడుతూంది."

సుబ్బారాయుడి మాటలు సాంతం వినిపించు కోకుండా గిరుక్కున వెనుదిరిగి వచ్చేశాడు అనంత మూర్తి.

"రేయ్, సుబ్బుడూ!" విషయం వినగానే అగ్గి మీద గుగ్గిలంలా మండి పడుతూ కేకేశాడు జగపతి.

గజ గజా వణుకుతూ నిల్చున్నాడు సుబ్బారాయుడు.

దవడపళ్ళు రాలిపోయేలా ఒక్కటి అంటించి "దాన్ని ఇలా పట్టుకురా!" అన్నాడు జగపతి. మారు మాట్లాడకుండా వెళ్ళాడు సుబ్బారాయుడు.

లాడ్జిలోని మెరుపుతీగ పులుల మధ్య లేడి కూనలా నిల్చుంది!

"నీ పేరేమిటి?" తమకం పట్టలేక అడిగాడు జగపతి.

"లావణ్య."

"పెట్టిందా, లేక పెట్టుకున్నదా?" వైకుంటం కామెంట్.

"ఏదైతేనేం—నన్నే మైమరిపించిన ఈ నగువ పేరుకు తగినదే!" లొట్టలు వేస్తూ అన్నాడు అనంతమూర్తి.

విపరీతమైన తలనొప్పి, జ్వరంతో లావణ్య ఒళ్ళు సలసలా కాగిపోతున్నా, అవేవీ ఖాతరు చేయలేదు త్రిమూర్తులు.

ఆమె అణువణువులోని లావణ్యాన్ని గాట్లుపెట్టి జుర్రుకున్నారు. బాధతో మెలికలు తిరిగిపోతున్నా, ఆ రాత్రి తెల్లవారేదాకా ముప్పురూ వంతుల ప్రకారం పందేం మీద అనుభవించా రామెను.

ముందే అనారోగ్యం—పైగా పైశాచిక కృత్యాలు తోడవ్వడంతో భళ్ళున తెల్లారేసరికి లావణ్యంతో బాటు ప్రాణాలూ కోల్పోయింది లావణ్య. . .

* * *

ఆ రాత్రికి ముందు పగటివేళ జగపతి, వైకుంటం, అనంతమూర్తి — ఈ ముప్పురూ సాగించిన కార్యకలాపాల సారాంశం కొంచెం ప్రస్తావిస్తే, అంతటితో కథ ముగిసిపోయినట్లే.

జగపతి సభలో గంటలు తరబడి ప్రజలకి ఉపన్యాసం ఇచ్చిన అంశం —"వేశ్యా గృహాల నిర్మూలనకి ప్రజలే ముందుకు రావాలి!"

అనంతమూర్తి రాసిన కథ— "వేశ్యకూడా ఒక మనిషే!"

తన పత్రికకి వైకుంటం చెడు తిరిగి సేకరించిన విషయం—"పట్టణంలో పడుపు వృత్తులు—పాడై పోతున్న ప్రజలు".

*